ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 2 ఆగస్టు 2024



తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్





ఐదేళ్ల జగన్ పాలనలో జిల్లాలో రియల్ మాఫియా పేట్రేగిపోయింది. జిల్లాలో ఉన్న కడప కార్పొరేషన్, మున్సిపాలిటీలు, కుడా పాలకవర్గం అంతా వైసీపీ చేతుల్లో ఉంది. అందుకే కడప అర్బన్ డెవల్‌మెంట్ అథారిటీని వైసీపీ నాయకుల ఆస్తి డెవలప్‌మెంటుగా మార్చుకున్నారు. ఇక కడప కార్పొరేషన్ అయితే మేయరు సురేశ్‌బాబు, మాజీమంత్రి అంజద్‌బాషా గ్యాంగ్ వారి సొంత జాగీరులా భావించి నిబంధనలు అతిక్రమించారని ఆరోపణలున్నాయి. మేయర్ హోదాలోనే అప్పటి డిప్యూటీ సీఎంతో కలిసి అనుమతి లేని లేఅవుట్లను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు రెండువేల ఎకరాల్లో అక్రమ వెంచర్లు వెలిశాయి. పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు అవినీతికి, బంధుప్రీతికి, రాజకీయ పెత్తనానికి కేరాఫ్ అడ్రస్‌గా మారడంతో జిల్లాలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్‌లు వెలిశాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడానికి చెల్లించాల్సిన ఫీజులు చెల్లించకుండా, ఒక్క సెంటు స్థలం కూడా సామాజిక అవసరాలకు వదలకుండా రియల్ మాఫియా దందా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ లేవుట్లపై ప్రభుత్వం నియమించిన కమిటీ నేడు విచారణ చేయనుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

రియల్ మాఫియా

- వేల ఎకరాల్లో అక్రమంగా వెంచర్లు
- నాలా పన్నుతో పాటు లేఅవుట్ ఫీజులకు ఎగనామం
- నోటీసులకు పరిమితమైన కుడా అధికారులు
- సెంటు భూమి కూడా పంచాయతీలకు వదలని వైనం
- జగన్ జమానాలో వైసీపీ వారు ఆడిందే ఆట
- కొని మోసపోయిన సామాన్యులు
- అమ్ముకుని కోట్లు కొల్లగొట్టిన వైసీపీ గ్యాంగ్
- అక్రమ లేఅవుట్లపై కమిటీ వేసిన మున్సిపల్‌శాఖ మంత్రి
- నేడు జిల్లాలో పర్యటించనున్న కమిటీ



ప్రొద్దుటూరులో హైవే రోడ్డు పక్కన వేస్తున్న వైసీపీ నాయకుడి అక్రమ లేవుట్

కడప/ప్రొద్దుటూరు, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నడూ వేయని రీతిలో జిల్లాలోని చాలా మండలాల్లో వేల ఎకరాల వ్యవసాయ భూముల్లో అక్రమ లేఅవుట్లు వేశారు. ఈ లేఅవుట్‌లలో ఎక్కడా సెంటు భూమికూడా సామాజిక అవసరాలకు వదలలేదు. కేవలం లేఅవుట్ బ్రోచర్‌లో ఓపెన్ స్పేస్‌లు, పార్కులు లాంటి ఊహా చిత్రాలను ముద్రించి ప్రజలను మోసం చేసి ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారు. అంతేకాకుండా లేఅవుట్‌కు అనుమతి ఫీజులు చెల్లించకపోవడంతో ప్లాటు కొన్న వారిమీదనే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు 14 శాతం డాక్యుమెంటు వ్యాల్యూపైన పడుతోంది. కడప అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (కుడా) అనుమతులు గానీ పంచాయతీ, మున్సిపాలిటీ, నగరపాలక అనుమతులు కానీ తీసుకోకుండానే లేఅవుట్‌లు వేసి ప్లాట్లను విక్రయించి రియల్ మాఫియా కోట్లు దండుకున్నారు.



కడప నగరం వినాయక్‌నగర్ సమీపంలోని మినిస్టర్ లేఅవుట్

ఐదేళ్లలో 585 అక్రమ లేఅవుట్‌లు

ఉమ్మడి కడప జిల్లాలోని 51 మండలాల్లో 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ కాలంలో 585 అక్రమ లేఅవుట్‌లు వేసినట్లు గుర్తించారు. వాస్తవానికి ఇవి 1000కి పైగా ఉన్నట్లు సమాచారం. ఇందులో కేవలం 25 లేఅవుట్లకు మాత్రమే అనుమతులు తీసుకున్నారు. ఇందులో పది ఎకరాలకు పైగా ఉన్నవి 76 లేఅవుట్లు, పది ఎకరాల నుంచి 5 ఎకరాలలోపు ఉన్నవి 119 లేఅవుట్లు, రెండు నుంచి 5 ఎకరాలలోపు ఉన్నవి 204 లేఅవుట్లు, రెండు ఎకరాల లోపు ఉన్నవి 129 లేఅవుట్లు.. మొత్తం 585 అక్రమ లేఅవుట్లు వెలసినట్లు గుర్తించారు. ఈ లేఅవుట్లు దాదాపు 2వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే కుడా అధికారులు కేవలం అక్రమ లేఅవుట్ యజమానులకు నోటీసులు జారీ చేయడంతో సరిపెడుతున్నారు. కొన్ని లేఅవుట్‌లకు మాత్రం మూడు కోట్ల పెనాల్టి వేశారు.

జేబులు నింపుకున్నారు

అక్రమ లేవుట్ల వ్యవహారంలో పంచాయతీ అధికారులు పెద్దఎత్తున జేబులు నింపుకున్నారు. అంతేకాకుండా నియోజకవర్గ ప్రజా ప్రతినిధుల దగ్గరనుంచి గ్రామ సర్పంచ్ వరకు ఎకరాకు విలువను బట్టి రూ.లక్ష నుంచి రూ.పది లక్షలవరకు అక్రమ అవుట్లలో దండుకున్నారు. దీంతో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులతో పాటు అధికారుల అవినీతి పంట పండింది. ముఖ్యంగా కడప ప్రొద్దుటూరు, రాయచోటి, పులివెందుల జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం రాజంపేట, రైల్వేకోడూరులలో పెద్ద ఎత్తున అక్రమ లేఅవుట్లు వెలిశాయి. ఇందులో కడప, ప్రొద్దుటూరులో అత్యధికంగా అక్రమ లేవుట్లు వెలిశాయి. వైసీపీ నేతలు నేరుగా ఈ దందాలో వందల కోట్లు అక్రమంగా గడించారు.

పెద్దల లేఅవుట్లు టచ్ చేసే దమ్ముందా

అక్రమ లేఅవుట్లపై విచారణ చేసేందుకు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నియమించిన కమిటీ గురువారం రాత్రికి జిల్లాకు రానుంది. శుక్రవారం నుంచి జిల్లాలో పర్యటించనుంది. అయితే పెద్దలు అనుమతి లేకుండా వేసిన లేఅవుట్లను పరిశీలించి వారిపై చర్యలు తీసుకునే సత్తా ఉందా అంటూ చర్చ నడుస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ కోసం కష్టపడిన బ్యాచ్ అంతా చంద్రబాబు సీఎం అయిన తరువాత ఇప్పుడు కూటమి వైపు వచ్చేసింది. అక్కడ అక్రమాలు చేసిన వారే ఇప్పుడు కూటమిలో కీరోల్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో కమిటీ జిల్లావ్యాప్తంగా పరిశీలించి అడ్డగోలుగా ఉన్న వాటిపై చర్యలు తీసుకుంటుందా అన్న చర్చ నడుస్తోంది. కడపలో కోడూరు గ్రామం సమీపంలో కేసీ కెనాల్ వద్ద అనుమతులు లేని లేఅవుట్లు వేశారు. ఇక అలంఖాన్‌పల్లె నుంచి రాజంపేట వెళ్లే రోడ్డులో ఓ షోరూం వద్ద 20 ఎకరాల్లో లే అవుట్ ఉంది. చలమారెడ్డిపల్లెలో వేసిన అనుమతులు లేని లేఅవుట్‌ను అప్పటి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేశ్‌బాబు ప్రారంభించారు. మాజీ ఎంపీ సాయిప్రతాప్‌రెడ్డి ఇంటి వద్ద అనుమతి లేకుండానే వెంచర్ వేశారు. అక్కడికి ఎవరైనా వెళితే లేపేస్తామంటూ బెదిరిస్తున్నారు. ఇక సీకేదిన్నె పోలీసుస్టేషన్ సమీపంలో అడ్డగోలు లేఅవుట్ వేశారంటారు. ఆ లేఅవుట్‌లో అక్కడ పనిచేసిన ఓ సీఐ, ఎస్‌ఐ పేరు బాగా ప్రచారంలో ఉంది. బుద్ధ టౌన్‌షిప్‌పై పెద్దఎత్తున విమర్శలున్నాయి. అక్కడ తీసుకున్న అనుమతులకు, వేసిన లేఅవుట్‌కు చాలా వ్యత్యాసం ఉందని అంటున్నారు. హైకోర్టు ఆదేశించినా కూడా అధికారం మాటున వాస్తవాలు బయటికి రాలేదు. ఇక సీకేదిన్నె పరిధిలో భావనా టౌన్‌షిప్‌లో వివాదం ఉంది. జిల్లా వ్యాప్తంగా ఇలా ఎన్నో లేఅవుట్లు ఉన్నాయి. వాటిని కమిటీ తనిఖీ చేసి అక్రమాలపై నిష్పాక్షికంగా చర్యలు తీసుకునేలా చర్యలు చేపడుతుందా అనే అనే చర్చ ఉంది.

అక్రమ లేవుట్‌లపై చర్యలు తీసుకుంటున్నాం..

ఉమ్మడి కడప జిల్లాలో గత ఐదేళ్లలో 585 అక్రమ లేవుట్‌లకు గాను 285 వాటికి నోటీసులు ఇచ్చాం. దాదాపు వీరి నుంచి రూ.3 కోట్లు పెనాల్టీ రాబట్టాం. మైదుకూరు పులివెందుల రాయచోటి రైల్వేకోడూరు కడపలలో మొత్తం 10 లేఅవుట్‌లపై కేసులు కూడా వేశాం. ఆ లేవుట్‌ల వద్ద బోర్డులు పెట్టాం. హైకోర్టులో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వేసిన కేసువల్ల స్టే ఉంది. అందువల్ల అక్రమ లేఅవుట్‌లలోని ప్లాట్ల క్రయవిక్రయాలపై చర్యలు తీసుకోలేపోతున్నాం. పంచాయతీ అధికారుల సహకారం లేకపోవడం వలన పూర్తి స్థాయిలో అక్రమ అలేవుట్‌లను అరికట్టలేకపోతున్నాం.

- నందన్ ఓబులేసు, కుడా వైస్ చైర్మన్

తల్లిపాలకు ప్రత్యామ్నాయం ఏదీ లేదు


● కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు1: తల్లిపాలకు ప్రత్యామ్నాయం ఏదీ లేదని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. గురువారం రిమ్స్‌లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నవజాత శిశు విభాగంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తొలి ఆహారం తల్లిపాలు, తొలి టీకా కూడా అమ్మపాలే అన్నారు. నూటికి నూరు శాతం పోషక విలువలున్న తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఆరోగ్యకరమైన బలవర్ధక ఆహార విలువలున్న తల్లిపాలను ప్రతితల్లి పుట్టిన పిల్లలకు ఇవ్వాలని సూచించారు. శిశు మరణాల నియంత్రణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ విస్తృత ప్రచారం చేపట్టిందని, అందులో భాగంగా ఏటా ఆగస్టు మొదటి వారాన్ని ప్రపంచ తల్లిపాల వారోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలపై ప్రచురించిన పోస్టర్లను కలెక్టరు ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన తల్లులకు బ్రెడ్డు, పండ్ల రసం, బిస్కట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటపతి, ఇన్‌చార్జి ఆర్డీ ఏపీవీవీపీ శ్రీనివాసులు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి, రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, నర్సింగ్ సూపరింటెండెంట్ మాధురీలత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్లు కీలకం

కడప(కలెక్టరేట్), ఆగస్టు 1: సమాజ ఆర్థికాభివృద్ధితో పాటు జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల పాత్ర కీలకమని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ (డీఎల్‌ఆర్సీ) బ్యాంకర్ల సమావేశం జరిగింది. జిల్లాలో అన్ని బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ ఏడాది మార్చి నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.14.924 కోట్లకు గాను రూ.19.364 కోట్ల రుణాలు మంజూరు చేసి 129.75శాతం ఆర్థిక ప్రగతి సాధించామన్నారు. అలాగే జూన్ 30వ తేదీ నాటికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.17.939 కోట్లకు గాను రూ.6.612.49 కోట్ల రుణాలు మంజూరు చేసి 36.85 ఆర్థిక ప్రగతి సాధించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, అందుకు సంబంధించి అర్హత పొందిన లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజరు జనార్ధన్, జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, సరస్వతి, సురేశ్‌రెడ్డి, డాక్టర్ బ్రహ్మయ్య, నాగేశ్వరావు, ఆర్బీఐ ఆర్ఎం హనుమకుమారి, ఏజీఎం విజయవిహారి, మురళీమోహన్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఆర్డీగా డాక్టర్ శ్రీనివాసులు



కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు1 : వైద్యఆరోగ్యశాఖ జోన్-4 ఇన్‌చార్జి రీజనల్ డైరెక్టరుగా సివిల్ సర్జన్ డాక్టర్ వై.శ్రీనివాసులు గురువారం కడపలోని ఆర్డీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కడప ఆర్డీగా పనిచేస్తున్న రత్నకుమారి పదవీ విరమణ పొందడంతో ఆమె స్థానంలో ఈయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కర్నూలు జిల్లా నందవరంలో పుట్టిన డాక్టర్ శ్రీనివాసులు కర్నూలు కేఎంసీలో 1985 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థి. దేవనకొండ పీహెచ్‌సీలో 1994లో మెడికల్ ఆఫీసరుగా మొదట బాధ్యతలు తీసుకున్నారు. కర్నూలు సర్వజన ఆసుపత్రిలో 2000 నుంచి 2010 వరకు, 2012లో పాణ్యం పీహెచ్‌సీలో, కర్నూలు జీజీహెచ్‌లో డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవోగా 2016 నుంచి 2019 వరకు పనిచేశారు. 2019లో ఒంగోలులో అడిషనల్ డీఎంహెచ్‌వోగా , 2022లో బాపట్ల డీఎంహెచ్‌వోగా పనిచేశారు. అదే ఏడాది బదిలీపై కడప సర్వజన ఆసుపత్రిలో సీఎస్‌ఆర్‌ఎంవోగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఇన్‌చార్జి ఆర్డీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు.

47 మంది తహశీల్దార్లకు పోస్టింగ్‌లు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 1: ఎన్నికల విధుల కోసం ఫిబ్రవరిలో వచ్చిన ఇతర జిల్లాల తహశీల్దార్లు గతవారం రిలీవ్ అయ్యి స్వంత జిల్లాలకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహశీల్దార్లుగా డిప్యూటీ తహశీల్దార్ల పాలన సాగుతోంది. గురువారం కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్ని మండలాలతో పాటు కలెక్టరేట్‌లోని పరిపాలన విభాగానికి సంబంధించి 47 మంది తహశీల్దార్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ (ల్యాండ్)గా ప్రతాప్‌రెడ్డి, కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా వెంకటరమణ, కలెక్టరేట్ మెజిస్ట్రీరియల్‌గా ఎం.వెంకటస్వామి, స్పెషల్ తహశీల్దారు లాండ్ రీఫామ్స్‌గా జీవీ నాగేశ్వరరావు, అడిషనల్ తహశీల్దారు ల్యాండ్ రీఫామ్స్‌గా శరత్ (పీఎస్), తహశీల్దారు ఎస్‌డబ్ల్యూఎల్‌ఏ ల్యాండ్ ఆక్విషన్‌గా పి. భారతి, కడప కేఆర్‌ఆర్‌సీగా (ఆర్డీవో) బద్రుజం పోస్టింగులు పొందారు.

● బద్వేలు డివిజన్‌లో.. మైదుకూరుకు వి.రాజసింహ నరేంద్ర, కాశినాయనకు బాల నరసింహులు, కలసపాడుకు మహబూబ్ బాషా, పోరుమామిళ్లకు చంద్రశేఖర్‌రెడ్డి, బి.కోడూరుకు పీఎండీ అలీఖాన్ తహశీల్దార్లుగా నియమితులయ్యారు. అలాగే.. బద్వేలుకు ఉదయభాస్కర్ రాజు, గోపవరంకు ఉదయభారతి, బి.మఠంకు దామోదరరెడ్డి, అట్లూరుకు సువర్ణాదేవి, బద్వేలు డీఏవోగా అక్బల్‌బాషా నియమితులయ్యారు.

● కడప డివిజన్‌లో.. కడపకు ఎంవీఎస్ నారాయణ రెడ్డి, కడప అర్బన్‌కు శేషారాంసింగ్, కమలాపురంకు బి.శివరామిరెడ్డి, వల్లూరుకు శ్రీవాణి, చెన్నూరుకు జీవన్ చంద్రశేఖర్, సీకేదిన్నెకు నాగేశ్వరరావు, పెండ్లి మర్రికి బి.అనురాధ, ఒంటిమిట్టకు ఏవీ రమణమ్మ, ఖాజీపేటకు పి.సరస్వతి, కడప డీఏఓగా శంకర్‌రావు నియమితులయ్యారు.

● జమ్మలమడుగు డివిజన్‌లో.. జమ్మలమడుగుకు పి.శ్రీనివాసులరెడ్డి, పెద్ద ముడియంకు బి.వెంకటసుబ్బయ్య, మైలవరంకు లక్ష్మీనారాయణ, ముద్దనూరుకు పి.రామకుమారి, కొండాపురానికి మాధవ కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరుకు గంగయ్య, రాజుపాలెంకు జి.వెంకటేశ్వర్లు, దువ్వూరుకు జి.వి. మధురవాణి, చాపాడుకు రవీంద్రారెడ్డి, యర్రగుంట్లకు కె.శోభన్‌బాబు, జమ్మలమడుగు డీఏఓగా తిరుపతయ్య..

● పులివెందుల డివిజన్‌లో.. సింహాద్రిపురానికి వి.గురప్ప, లింగాలకు ఈశ్వరయ్య, తొండూరుకు బి.రామచంద్రుడు, పులివెందులకు నజీర్ అహమ్మద్, వేములకు ఎం. ఇంద్రారాణి, వేంపల్లికి వై.హరినాథ్‌రెడ్డి, చక్రాయపేటకు విజయకుమారి, వీఎన్‌పల్లెకు వి.లక్ష్మీదేవి, పులివెందుల డీఏఓగా ఎంఏ రమేశ్ నియమితులయ్యారు.

సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ వ్యాజ్యంపై.. హైకోర్టు విచారణ 12కి వాయిదా

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో తప్పుడు సాక్ష్యం చెప్పాలంటూ తనను బెది రించారంటూ ఏ-7 గజ్జల ఉదయ్‌కు మార్‌రెడ్డి ఇచ్చిన ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా కడప రిమ్స్ పోలీసు స్టేషన్‌లో నమో దు చేసిన కేసును కొట్టివేయాలని సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఈనెల 12కి వాయిదా వేసింది. వివేకా హత్య కేసును తెలంగాణకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, అలాగే ఉదయ్‌కుమార్‌రెడ్డికి బెయిల్ నిరాకరిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను మెమో రూపం లో కోర్టు ముందు ఉంచేం దుకు రామ్‌సింగ్‌కు వెసులు బాటు ఇచ్చింది. ఆ రోజు వ్యాజ్యంపై తుది విచారణ జరుపుతామని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

వివేకా హత్యకేసులో తప్పుడు సాక్ష్యం చెప్పాలని సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ తనను బెదిరించారని ఉదయ్‌కుమార్‌రెడ్డి కడప ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆ కోర్టు కడప రిమ్స్ పోలీసులను ఆదేశించింది. పోలీసులు రామ్‌సింగ్‌పై ఐపీసీ సెక్షన్లు 195ఏ, 323, 506 రెడ్ విత్ 34 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రామ్‌సింగ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఈ కేసులో తదుపరి చర్యలన్నిటినీ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం గురువారం మరోసారి విచారణకు రాగా సీబీఐ తరఫున కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి యజ్ఞదత్ వాదనలు వినిపించారు. వివేకా హత్య కేసును తెలంగాణకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, అలాగే గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డికి బెయిల్ నిరాకరిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కోర్టు ముందు ఉంచామన్నారు. ఉదయ్‌కుమార్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ప్రద్యుమ్న కుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు. వివేకా హత్య కేసులో తప్పుడు సాక్ష్యం చెప్పాలని బెదిరించినట్లు సీబీఐ ఎస్పీపై మరొకరు కూడా కేసు పెట్టారని.. దీనిపై దర్యాప్తు అధికారి హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టివేసిందని.. ప్రస్తుత కేసులోనూ అవే ఉత్తర్వులను వర్తింపజేయాలని కోరారు. కేసు దర్యాప్తు పూర్తిచేసి పోలీసులు చార్జిషీటు సైతం దాఖలు చేశారన్నారు. యజ్ఞదత్ స్పందిస్తూ.. తదుపరి విచారణలో అన్ని వివరాలనూ కోర్టు ముందు ఉంచుతామన్నారు. అదనపు సొలిసిటర్ జనరల్ నేరుగా వాదనలు వినిపిస్తారని తెలిపారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను 12కి వాయిదా వేశారు.

ఇష్టానుసారం మట్టి తవ్వకాలు

● టిప్పర్లతో యథేచ్ఛగా తరలింపు

● అడ్డుకున్న వీఆర్‌ఏ, ఆమె భర్తపై దాడి



పులివెందుల టౌన్, ఆగస్టు 1: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కె.వెలమవారిపల్లె గ్రామ పరిధిలోని కొండను తవ్వేసి మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. కొద్దిరోజులుగా ఈ అక్రమ రవాణా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. దాదాపు పది హిటాచీలను పెట్టి టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. టిప్పర్ మట్టి రూ.4వేలతో అమ్ముకుని భారీ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. అంతేకాకుండా కొండను చదును చేసి పొలాలకు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి 9గంటల సమయంలో అధికారులు ఫోన్ చేయడంతో అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకునేందుకు మహిళా వీఆర్‌ఏ మునిలక్ష్మి, ఆమె భర్త వెళ్లారు. వీరు పనులను బంద్ చేయించి తిరిగి వస్తుండగా వారిపై మట్టి తవ్వకాలు జరుపుతున్న వారు దాడి చేశారు. ఈ నేపథ్యంలో గురువారం వీఆర్‌ఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. అనంతరం ఆమె మాట్లాడుతూ బుధవారం రాత్రి 9గం టలకు ఆర్‌ఐ ఫోన్ చేసి తవ్వకాలను నిలిపివేయాలని చె ప్పారన్నారు. దీంతో తాను, తన భర్త బాలవెంగముని మరో ఇద్దరితో కలిసి వెళ్లామన్నారు. పనులను ఆఫ్ చేయించి ఫొటోలు తీసుకొని, అధికారులకు సమాచారం ఇచ్చి తిరిగి వస్తుండగా.. ముగ్గురు వ్యక్తులు అడ్డుకుని దాడి చేశారన్నా రు. అధికారులకు విషయం తెలిపి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తమ ఫిర్యాదు మేరకు ఇద్దరి పై పోలీసులు కేసు నమోదు చేశారని ఆర్‌ఐ సుజిత్ తెలిపారు.



2,58,100 మందికి పింఛన్ల పంపిణీ

కడప(కలెక్టరేట్), ఆగస్టు 1: జిల్లా వ్యాప్తంగా గురువారం తెల్లవారుజాము నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టారు. మొత్తం 2,64,013 మందికి గాను అందుబాటులో ఉన్న 2,58,100 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు తెల్లవారుజామున 4 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రక్రియను సచివాలయ సిబ్బందితో చేశామని, 97.76 శాతం పంపిణీ చేయడంతో రాష్ట్రంలోనే జిల్లాకు 4వ స్థానం వచ్చిందన్నారు. పింఛన్ల పంపిణీని విజయవంతం చేసిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. కాగా.. జిల్లా వ్యాప్తంగా అధికారులు, రెవెన్యూ సిబ్బందితో పాటు టీడీపీ నేతలు వెళ్లి పింఛన్లను అందజేశారు. కమలాపురం, ప్రొద్దుటూరులో ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, వేంపల్లెలో బీటెక్ రవి, కడపలో అమీర్‌బాబు, గోవర్ధన్‌రెడ్డి, శివకొండారెడ్డి, అట్లూరులో రితేశ్‌రెడ్డి, పోరుమామిళ్లలో రోషన్న, తదితరులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌భరోసా పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య

ఆక్రమణలో... బాలగురయ్యగారి కుంట

- పశువులు నీళ్లు తాగేందుకు దాత కుంట నిర్మాణం
- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణ
- రూ.కోట్ల విలువ చేసే భూమి చేతులు మారిన వైనం
- గతంలో టీడీపీ నాయకుల గగ్గోలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

బి.కోడూరు, ఆగస్టు 1: పూర్వం రైతులు తూర్పు కొండకు పశువులను తోలుకెళ్లి తాగేందుకు నీరు లేక అప్పట్లో అష్టకష్టాలు పడేవారు. వీరి కష్టాలను గమనించిన బాలగురయ్య అనే రైతు తన సొంత నిధులతో పశువుల కుంటను తన సొంత నిధులతో నిర్మించారు. కుంట నిర్మాణంతో పశువుల దాహార్తి తీరేదని పెద్దలు చెబుతారు. కాలక్రమంలో కుంట సమీపంలో ఉన్న భూములకు విలువ పెరిగింది. దీంతో కొందరు కబ్జాదారులు కన్ను కంటపై పడింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు కుంట స్థలాన్ని కబ్జా చేసి.. పట్టాలు పొంది ఆన్‌లైన్ కూడా చేయించుకున్నారు. అమ్మకాలు సాగించడంతో ముగ్గురు చేతులు మారాయి. ప్రస్తుతం పోరుమామిళ్ల పట్టణానికి చెందిన ఓ బంగారు అంగడి యజమాని కొనుగోలు చేశారు. వివరాల్లోకి వెళితే..

బి.కోడూరు మండలంలోని అమ్మవారిపేట గ్రామానికి చుట్టుపక్కల ఉన్న దాదాపు 20 గ్రామాల రైతులు పశువులు, ఎద్దులు, మేకలు, గొర్రెలను తూర్పు కొండకు తోలుకుని వెళ్లి అక్కడ పచ్చిక మేపుకుని తిరిగి తాగునీటి కోసం ఇంటికి వచ్చేవారు. బద్వేలు - పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డుకు దగ్గరలో దాదాపు ఆరు ఎకరాల విస్తీర్ణంలో కుంటను సొంత నిధులతో నిర్మించారు. అప్పటి నుండి ఆ కుంటలో కరువు కాలంలో రైతులు పశువులు నీళ్ల తాగేందుకు వాడుకుంటూ ఉండేవారు. ఆ కుంట మున్నెల్లి రెవెన్యూ గ్రామంలో 2786లో దాదాపు ఆరు ఎకరాలు కుంట ఉండేదని, ఆ కుంట మరమ్మత్తుల కోసం 1996లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టెండరు నిర్వహించి మరమ్మత్తులు చేసింది. అలాగే 2002లో మార్కెట్‌యార్డునిధులతో అప్పటి టీడీపీ ప్రభుత్వం మరమ్మతులు, అలాగే 2017లో నీరు చెట్టు కింద పది లక్షల రూపాయల నిధులతో మరమ్మతులు చేశారు. మొత్తం దాదాపుగా అప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.20 లక్షలు కుంట నిర్మాణం కోసం ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో కొంత మంది ఆ కుంటను ఆక్రమించుకుని పట్టాలు పొందారు. ఆ తర్వాత ఇప్పటికే ముగ్గురు చేతులు మారాయి.

బద్వేలు-పోరుమామిళ్ల మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ భూములు ఉండడం, వాటి విలువ అమాంతంగా పెరగడంతో స్థానికేతరుల కన్ను ఆ భూములపై పడింది. దీంతో గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఆక్రమణలకు పాల్పడి.. రాత్రికి రాత్రే కంచెలు వేసి.. చెట్లు నాటడం వంటివి చేపట్టి పొలాలను అడ్డంగా ఆక్రమిం చుకుని.. ఆన్‌లైన్ కూడా చేయించుకున్నారు. గత ప్రభుత్వానికి ముందు రోడ్డుకిరువైపులా అన్నీ ప్రభుత్వ భూములుగా ఉండి, చెట్లు, చేమలుండేవి. వాటిని రాత్రికి రాత్రే యంత్రాల సహాయంతో తొలగించి.. రాత్రికి రాత్రే కంచెలు, చెట్లు ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

కబ్జా స్థలంలో టీడీపీ నాయకుల ఆందోళన

గత వైసీపీ ప్రభుత్వంలో ఆక్రమణకు గురైన కుంటను మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించి అప్పట్లో ఆందోళన చేపట్టి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని వారు వాపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దారును వివరణ కోరగా, పరిశీలించి కుంట ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.



ఆక్రమణకు గురైన బాలగురయ్యగారి కుంటలో చీనీచెట్లు



కుంట స్థలంలో ఆక్రమణదారుడు నిర్మించుకున్న గెస్ట్‌హౌస్



కుంటలో ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్‌ఫొటో)

స్టాక్ వివరాలు నమోదు చేయాలి

- రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి



బియ్యం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

రైల్వేకోడూరు (రూరల్) ఆగస్టు, 1: బియ్యం గోడౌన్‌లో ఉండే స్టాక్ పాయింట్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ నిదియా దేవి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని బియ్యం గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. గోడౌన్‌లో ఉండే స్టాక్ వివరాలను అక్కడే ఉన్న డిప్యూటీ తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిత్యావసర వస్తువుల గురించి ఆరా తీశారు. ప్రతి రేషన్ దుకాణానికి సరైన సమయంలో సరుకులు చేరాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిప్రసాద్, ఆర్ఐ రాజశేఖర్, గోడౌన్ డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, గోడరాళ్ల ట్రాక్టర్లు సీజ్



జమ్మలమడుగు, ఆగస్టు 1: జమ్మలమడుగులో రోజు రోజుకు ఇసుక, కొండరాళ్ల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. జమ్మలమడుగు మండలం గూడెం చెరువు, గండికోట దారి నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతోంది. పెన్నానదిలో పగలే ఎక్స్‌కవేటర్లతో ఇసుకను నింపుకుని అక్రమ రవాణా చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా బ్రహ్మణి స్టీల్‌ప్లాంట్‌వైపు నుంచి గోడ ఎర్రరాళ్ల (కొండ) తరలిస్తున్నారు. జమ్మలమడుగులో బుధవారం రాత్రి పోలీసులు నాలుగు ఇసుక ట్రాక్టర్లు, కొండ రాళ్ల తరలించే మూడు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకుని.. స్టేషన్‌కు తరలించారు.

పెరిగిన పింఛన్‌తో పేదల కుటుంబాల్లో సంతోషం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 1: పెరిగిన పింఛన్‌తో పేదల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని, పండుగ వాతావరణం కనిపిస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని మాసాపేట, దిగువ అబ్బవరం, కొత్తపేట, పాతరాయచోటి తదితర ప్రాంతాల్లో పేదలకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పేదల కష్టాలు వింటూ టీ తాగుతూ ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజలతో మమేకమవుతూ పింఛన్లను పేదలకు అందించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమకు పక్కాగృహాలు కావాలని, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రతిఒక్కరికీ పక్కా గృహం, పింఛన్లు మంజూరు చేస్తామని, లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లయితే వెంటనే వాటిని పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందచేస్తామని తెలిపారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్వయంగా పేదల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి విద్యాధర్, సుగవాసి పాలకొండ్రాయుడు, దర్బార్‌బాషా, గుర్రం సుబ్బయ్యనాయుడు, ఆంజనేయులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాసాపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



కడప (క్రైం), ఆగస్టు 1: కడప నగరంలో వేర్వేరు చోట్ల గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 4.25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రిమ్స్ ఎస్ఐ కె.రామచంద్ర తెలిపిన మేరకు.. గురువారం తమ సిబ్బందితో చలమారెడ్డిపల్లె సర్కిల్ వద్ద గంజాయి విక్రయిస్తున్న నగిలి బాలకొండారెడ్డి ఆలియాస్ కొండారెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.10వేలు విలువ కలిగిన 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అట్లూరు మండలంలోని ముత్తుకూరు గ్రామానికి చెందిన నగిలి బాలకొండారెడ్డి గంజాయి విక్రయించడమే తన వృత్తిగా చేసుకుని విశాఖపట్టణం వెళ్లి ఎవరికీ అనుమానం రాకుండా ట్రైన్‌లో తీసుకువచ్చి కడపలో అమ్ముతూ ఉంటాడన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఇతన్ని పట్టుకుని ఇన్‌చార్జ్ డీఎస్పీ సుధాకర్ పర్యవేక్షణలో అతనిపై డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ అధికారులు నిఘా ఉంచారు. ఈ క్రమంలో నిందితుడు గంజాయి విక్రయిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే.. కడప నగరం గౌస్‌నగర్ సమీపంలో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు టూటౌన్ ఇన్‌చార్జి సీఐ నాయక్, ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు. కడప మహబూబ్‌నగర్ స్ట్రీట్‌కు చెందిన అజారుద్దీన్ ఆలియాస్ అర్జున్ గంజాయి అమ్ముతుండగా అతన్ని అరెస్టు చేసి 1.75 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రైతుల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం : పుత్తా



కేసీ కెనాల్‌లో నీళ్లకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

వల్లూరు, ఆగస్టు 1 : రైతన్నల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆగస్టు మొదట్లోనే కేసీ కెనాల్ నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దేవునికడప చెరువుకు కూడా నీళ్లు చేరుతాయని.. తద్వారా కడప ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందు చూపుతోనే పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టడంతో కృష్ణా నీటిని డైవర్షన్ చేసి.. ఇలా వదులుతున్నామని అన్నారు. రైతుల పక్షపాతి అయిన ఆయన ప్రతి ఎకరాకు నీటిని అందించేందుకు తపన పడుతున్నారన్నారు. గత మూడేళ్లుగా నీళ్లిచ్చినా రైతులు పంటలను పండించుకోలేని దుస్థితి ఉండేదన్నారు. తమ ప్రభుత్వంలో రైతులు సకాలంలో పంటలు సాగుచేసుకునేందుకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వల్లూరు టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, చెన్నూరు అధ్యక్షుడు విజయభాస్కర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శివారెడ్డి, గడికోట సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఆదినిమ్మాయపల్లె ఉప సర్పంచ్ రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, విజయారెడ్డి, ఓబుల్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎంపీడీవో విజయభాస్కర్, రెవెన్యూ సిబ్బంది, ఆయకట్టుకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ హబ్‌గా కొప్పర్తి : కలెక్టర్



కొప్పర్తిలో మొక్క నాటుతున్న కడప జిల్లా కలెక్టర్, జేసీ

సీకేదిన్నె, ఆగస్టు 1: మెగా ఇండస్ట్రియల్ హబ్‌గా కొప్పర్తి అభివృద్ధి చెందుతుందని.. జిల్లాకే తలమానికంగా ఉంటుందని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో నూతన పరిశ్రమలు 500 ఎకరాల్లో ఏర్పాటు అయిన మెగా ఇండ్రస్ట్రియల్ హబ్‌లో ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను జేసీ అతిధిసింగ్‌తో కలిసి గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీలో రెండు లక్షల చదరపు అడుగుల్లో ఏపీఐఐసీ నిర్మించిన షెడ్లలో అల్‌డిక్సన్ కంపెనీ, సీపీప్లస్ కంపెనీ నిర్వహణలో సీసీ కెమెరాలు, ఇతర సెక్యూరిటీ, సిస్టం ఉత్పత్తిని, నాణ్యతను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి అందుతున్న సదుపాయాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎటువంటి సదుపాయాలు కావాలన్నా తన దృష్టికి తేవాలని యాజమాన్యాలకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొప్పర్తి పారిశ్రామికవాడను రాష్ట్రంలోనే మెగా ఇండ్రస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. త్వరలోనే కొప్పర్తిలో అనేక పరిశ్రమలు రూపుదిద్దుకుంటాయని.. జిల్లాలో యువతకు భారీగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం కలెక్టర్, జేసీలు ఆల్‌డిక్సన్ కంపెనీ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ నినాదం స్ఫూర్తితో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటపతి, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ ఉదయ్ కుమార్, ఇండ్రస్ట్రియల్ జీఎం జయలక్ష్మి, ఆల్‌డిక్సన్ జీఎం రాజీవ్‌శైని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తి అరెస్ట్

రాజంపేటటౌన్, ఆగస్టు 1: రాజంపేట పట్టణానికి చెందిన ధర్మిశెట్టి చంద్రశేఖర్‌ను చెక్ బౌన్స్ కోర్టు ఆదేశాల మేరకు గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ మద్దెయ్య ఆచారి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రాజంపేట మండల పరిధిలోని పోలి గ్రామానికి చెందిన కిచ్చగారి రామచంద్ర అనే వ్యక్తికి 2007 సంవత్సరంలో రాజంపేట పట్టణానికి చెందిన ధర్మిశెట్టి చంద్రశేఖర్ చెక్ ద్వారా చెల్లించాల్సిన డబ్బు చెల్లించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కోర్టుకు పలుమార్లు గైర్హాజరు కావడంతో కోర్టు ధిక్కరణ కింద చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

కడప(రూరల్) ఆగష్టు 1: ద్విచక్ర వాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి తద్వారా ప్రమాదాలను నివారించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయవాదుల సంఘం భవనంలో హెల్మెట్ వాడకం, ఉపయోగాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ మనల్ని మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. న్యాయవాదులు, వాహనదారులు హెల్మెట్ వాడి నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలన్నారు. రోడ్డు భద్రత నియమావళిని పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడంపై తగు అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్పనాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అండర్-19 క్రికెట్ పోటీలు

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 1: కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. మూడోరోజు గురువారం వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌ల్లో తీరిలా..

- కేఎస్‌ఆర్ఎం మైదానంలో క్రిష్ణా-వెస్ట్ గోదావరి జట్లమధ్య సాగింది. టాస్ నెగ్గిన వెస్ట్‌గోదావరి జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 87 ఓవర్లలో 281 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో రక్షణ్ 87 పరుగులు, రేవంత్ 68 పరుగులు చేశారు. క్రిష్ణా జట్టు బౌలింగ్‌లో రాజేశ్, గీత్ చెరీ 5 వికెట్లు సాధించారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన క్రిష్ణా జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 16 పరుగులు చేసింది. ఇందులో ధనుష్ 8 పరుగులతో, భవాని 6 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.
- రిమ్స్ సమీపంలోని ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు- నెల్లూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో 51.3 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో నెల్లూరు జట్టు బౌలర్ పూర్ణ గణేశ్ 5 వికెట్లు పడగొట్టాడు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. దీంతో మరో 24 పరుగుల లోటుతో నెల్లూరు జట్టు సాగుతోంది.
- నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన శ్రీకాకుళం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సుశాంత్ 88 పరుగులు, కళ్యాణ్‌కుమార్ 72 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్‌లో 23 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 82 పరుగులు చేసింది. ఇందులో ఈశ్వర్ (బ్యాటర్) 43 పరుగులతో, మరో బ్యాటర్ యశ్వంత్ 20 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో విశాఖ మరో 130 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది.



5 చొప్పున వికెట్లు తీసిన రాజేశ్, గీత్ (క్రిష్ణా), పూర్ణగణేష్ (నెల్లూరు)

పేదలకు వరం ఎన్టీఆర్ భరోసా

● ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు,ఆగస్టు 1:పేదలకు ఎన్టీఆర్ భరోసా వరం లాంటిదని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. గురువారం చెన్నూరులో ఎమ్మెల్యే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, మానసిక వికలాంగులకు పిం ఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేర్చారన్నారు.చెప్పిన మాట ప్రకారం వృద్ధులు, వితంతవులకు వెయ్యి పెంచి రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, శాశ్వత అంగవైకల్యం ఉన్న వారికి రూ.15వేలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి పది వేల వంతున పింఛన్లు అందిస్తున్నామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ప్రజలకు ఏ అవసరం వచ్చినా తన ఇంటి తలుపు తట్టవచ్చన్నారు. అన్నివర్గాలకు టీడీపీ అండగా ఉంటుందని, త్వరలో ఎన్నికలహామీల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని తప్పక జరుగుతుందన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

ప్రమాదాల్లో వీల్‌చైర్‌కే పరిమితం అయినవారు, ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా వారు తమకు పక్కా గృహాలు, పింఛన్లు, తమ బిడ్డలకు ఉద్యోగవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనరు కె.విజయభాస్కర్ రెడ్డి, చెన్నూరు పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, మాజీ చైర్మన్ శివారెడ్డి, బలిజ సంఘం జిల్లా నాయకుడు ఆకుల ప్రసాద్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, అటవీ శాఖ మాజీ డైరెక్టరు శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జున రెడ్డి, సీనియర్ నేత ఖాజాహుసేన్, లక్ష్మీనారాయణ, అతికారి విశ్వం, వై.మణికంఠ, వేల్పుల సుబ్రమణ్యం, ఉప్పరపల్లె రామచంద్రరెడ్డి పాల్గొన్నారు.


మడమ తిప్పని నేత చంద్రబాబు

కమలాపురం రూరల్, ఆగస్టు 1 : సీఎం చంద్రబాబునాయుడు మాట ఇస్తే తప్పరని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. గురువారం దేవరాజుపల్లెలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.3వేలు పింఛను రూ.4వేలకు పెంచి అందిస్తున్నారన్నారు. జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, నాయకులు దాది రామయ్య, సూర్య న్యూలు సుబ్బారెడ్డి, మెరిన్ ప్రసాద్, రగంగరాజు, చిన్నరాయుడు పాల్గొన్నారు.

వల్లూరులో... ఆదినిమ్మాయపల్లెలో ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రజారంజకంగా పరిపాలన సాగించడమే సీఎం ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, స్థానిక మాజీ ఉప సర్పంచ్ రమణారెడ్డిచ శంకర్‌రెడ్డి, రవి, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి రోజే 90శాతం పైగా పింఛన్లు

సీకేదిన్నె, ఆగస్టు 1: నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో మొదటిరోజే 90 శాతంపైగా పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే చైతన్యరెడ్డి పేర్కొన్నారు. 16వ డివిజన్‌లోని నాయనవారిపల్లెలోఎమ్మెల్యే ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు టి.వి.క్రిష్ణారెడ్డి, ఏటూరు రామ చంద్రారెడ్డి, శివశంకర్, మునీంద్ర, నరసింహులు యాదవ్, రవి, తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

98 శాతం పింఛన్లు పంపిణీ

వీరపునాయునిపల్లె, ఆగస్టు1: మండలంలో గురువారం 98 శాత పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు 5181పింఛన్ లబ్దిదారులు ఉన్నారన్నారు. వీరికి సచివాలయ సిబ్బందిచే అందజేసినట్లు తెలిపారు.వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

కడప (ఎడ్యుకే షన్), ఆగస్టు 1 : ప్రజాసంక్షేమంటీడీపీ అధినేత చంద్రబాబు లక్ష్యమని టీడీపీ నేతలు అన్నారు. గురువారం కడప నగరంలో ఉదయం 4 నుండి అవ్వతాతలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమం నిర్వహించారు.

19, 20 డివిజన్లలో... కడప నగరం 19, 20డివిజన్లలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు మోహన్‌రెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో... టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్ అమీర్‌బాబు ఆధ్వర్యంలో పింఛన్ల పం పిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయకుమార్ పాల్గొన్నారు.

26వ డివిజన్‌లో... కడప నగరం 26వ డివిజన్ మాసాపేటలో నగర అధ్యక్షులు శివకొండారెడ్డి ఆధ్వర్యంలో అవ్వతాతలకు పింఛన్ల పంపిణీ నిర్వహించారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మాసాపేట శివ, విశ్వనాద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

28వ డివిజన్‌లో... కడప నగరం 28వ డివిజన్ టీడీపీ మాజీ డిప్యూటీ మేయర్ ఆరిఫుల్లా ఆధ్వర్యంలో పింఛన్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్లా, సుబ్బరాయుడు, కమాల్‌బాషా, అల్లాబకాష్, జిమ్మిబాషా సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

45వ డివిజన్‌లో... 45వ డివిజన్‌లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్‌లు అనిల్, ఉదయ్ పాల్గొన్నారు.

జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రన్న

కడప (మారుతీనగర్), ఆగస్టు 1: అవ్వాతాత, దివ్యాంగుల మోముల్లో సీఎం చద్రరబాబు వెలుగులు నింపారని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షురాలు పి.ఈశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె దళితవాడలో ఆమెకు వీఆర్‌ఓ సుబ్బరాయుడు పింఛన్ అందజేశారు.

తెల్లవారకముందే పింఛన్ల పంపిణీ

పెండ్లిమర్రి, ఆగస్టు 1: ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు నాయకత్వంలో తెల్లవారకముందే ఇంటి ముంగిటకు పింఛన్ అందజేయడం జరుగుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు సంగటిగంగిరెడ్డి అన్నారు. గురువారం పింఛన్లుపంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ చెప్పిన మాట తప్పకుండా పింఛన్లు అందిస్తుండడంతో లబ్దిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు.



పింఛన్ అందజేస్తున్న వీఆర్‌ఓ సుబ్బరాయుడు



పెండ్లిమర్రి: పింఛన్ పంపిణీ చేస్తున్న గంగిరెడ్డి

పండుగలా పింఛన్ల పంపిణీ

● ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 1:పండుగలా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగిదని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూ టమి ప్రభుత్వంలో మొదటిరోజే 93శాతానికి పైగా పింఛన్ల పంపిణీ చేసి లబ్ధిదారుల ముఖంలో ఆనందం చూస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 5గంటలకే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారన్నారు. కడప నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపా రు. అధికారులకు సచివాలయ సిబ్బందికి తమ పార్టీ క్రియశీలక నాయకులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం లోటు బడ్జెట్‌లో కూడా అవ్వతాతలకు పింఛన్లు పంపిణీ చేయడం అది చంద్రబాబుకే చెల్లిందని స్పష్టం చేశారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న వీఎస్ అమీర్‌బాబు



పింఛన్లు పంపిణీ చేస్తున్న గోవర్ధనరెడ్డి



పింఛన్లు పంపిణీ చేస్తున్న శివకొండారెడ్డి

పోలీసు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ



కల్పతరు పోలీసు వెల్ఫేర్ స్టోర్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప (క్రైం), ఆగస్టు 1 :పోలీసు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పలు విభాగాలను ఆయన పరిశీలించారు. కల్పతరు పోలీసు వెల్ఫేర్ స్టోర్స్ సూపర్ మార్కెట్‌ను సందర్శించి అందులో లభించే కిరాణా, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల గు రించి ఆరా తీశారు. నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. అనంతరం పోలీసు ట్రాన్స్‌పోర్టు విభాగాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీసు జిమ్‌ను సందర్శించి అందులోని పరికరాలను పరిశీలించారు. కిడ్స్ స్కూ లును సందర్శించి చిన్నారులతో కాసేపు గడిపారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీసు సంక్షేమంలో భాగంగా నిర్వహిస్తున్న పుష్పగిరి గ్యాస్ ఏజన్సీని పరిశీలించారు. కనెక్షన్లు గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసు సంక్షేమ ఆసుపత్రిని పరిశీలించారు. రోగులకు చికిత్స అందించేందుకు ఎలాంటి సౌకర్యాలు పరికరాలు ఉన్నాయో ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మేరీ సుజాతను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. ఏమైనాఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంటును పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, ఆర్ఐ టైటస్, సంబంధిత విభాగాల సిబ్బంది ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం: ఎస్పీ

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 1 : డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరంపాటుపడదామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో కడప జిల్లా కమిటీ ముద్రించిన మాదక ద్రవ్యాల నిర్మూలనపై పోస్టరును ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు, మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దన్నారు. యువత మోజులో పడి చెడు వ్యసనాల బారిన పడి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ సంఘానికి అభినందనలు తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ మాట్లాడుతూ యువత డ్రగ్స్, మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదన్నారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, ఎస్పీ సీఐ వెంకటకుమార్, నాయకులు రాజేంద్ర, సురేశ్‌లు పాల్గొన్నారు.

వేంపల్లెలో పెండింగ్ పనులను సీఎం దృష్టికి తీసుకెళ్తా

● చెరువు పనుల్లో అవినీతి వెలికితీస్తాం

● ఒకేసారి పింఛన్ పెంచిన ఘనత బాబుదే: బీటెక్ రవి



వేంపల్లెలో పింఛన్ పంపిణీచేస్తున్న పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి

వేంపల్లె, ఆగస్టు 1: వేంపల్లెలో వైసీపీ నాయకులు అవగాహన లేకుండా చేపట్టిన తఅభివృద్ధి పనులైన రోడ్లు, కాల్వ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అవసరమైన మేరకు పెండింగ్ పనులను పూర్తిచేసేందుకు కృషిచేస్తామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెలిపారు. వైఎస్ జగన్ మాదిరి మాటలతో సరిపెట్టి విడతల వారీ కాకుండా ఒకేసారి రూ.1000 పెంచి రూ.4000 ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనని ఆయన పునరుద్ఘాటించారు. వేంపల్లెలోని శ్రీరామ్‌నగర్‌లో గురువారం ఎంపీడీఓ దివిజ, మండల పరిశీలకుడు రఘునాతరెడ్డి,కన్వీనర్ మునిరెడ్డి,మల్లికార్జున,రమణలతో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బీటెక్ రవి విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమం కోసం టీడీపీ ఎంతో చేస్తున్న పులివెందులలో ఓట్లు పడడం లేదని ఈసారైన టీడీపీని ఆదరించాలని కోరారు. గిడ్డంగివారిపల్లె చెరువులో జరిగిన అవినీతిపై విచారణ చేయిస్తామన్నారు. ఆ రిజర్వాయర్ యూసీఐఎల్ పరిధి దృష్ట్యా అసరమని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పూర్తిచేసేందుకు కృషిచేస్తానన్నారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, వక్ఫ్‌బోర్డు మాజీడైరెక్టర్ దర్బార్ బాష, ఎద్దుల శేషారెడ్డి, యువనాయకులు రజనీకాంత్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, మాజీ సర్పంచు వీరలింగేశ్వరరెడ్డి, దేవస్థాన మాజీచైర్మన్లు కొండయ్య, వెంకటస్వామి, పోతిరెడ్డి శివ, మైనార్టీ నాయకులు అల్లాబకాష్, తెలంగాణ వలి, పివి రమణ, నామా వేమకుమార్, దక్కా రమేష్, మస్తాన్, మడక శ్రీనివాసులు, రెడ్డి కిషోర్, బీజేపీనాయకులు గాలి హరిప్రసాద్,కుమార్, సుమన్, జనసేన నాయకుడు హరీష్ పాల్గొన్నారు.

'నీటి వివాదాల పరిష్కారం కోసం 5న రాష్ట్ర వ్యాప్త ఆందోళన'

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 1 : బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులపై ఏపీ ప్రభుత్వం వైఖరి తెలపాలని, రాష్ట్ర నీటి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ఆందోళన జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణ, గోదావరి నదీ జ లాల వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులకు భిన్నంగా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ మిగులు జలాలను కూడా లెక్కగట్టి నీటి కేటాయింపులు చేయడంపై గతంలో ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిందని గుర్తు చేశారు.

దళితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● కలెక్టరుకు డీహెచ్ పీఎస్ వినతి

కడప (ఎడ్యుకే షన్), ఆగస్టు 1 : జిల్లాలో దళితుల సమస్యలు పరిష్కరించాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మునెయ్య కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టరు శివశంకర్‌ను కలిసి డీహెచ్‌పీఎస్ డైరీని అందించి దళితుల సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలులో జడ్పీ హైస్కూలులో తొలగించిన వాచ్‌మెన్ సుధాకర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అలాగే మరికొన్ని సమస్యలు వివరించారు. దళిత నాయకులు బాబురావు, నారాయణ, సుధాకర్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

కడప (ఎడ్యుకే షన్), ఆగస్టు 1 :ఆంధ్రప్రదేశ్‌లోని వారసత్వ కేంద్రాలు చారిత్రక స్థలాలకు అభివృద్ధికి సంబంధించి నిధులు మంజూరు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు అమరావతి అభివృద్ధి కమిటి చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర పురావస్తుశాఖ జనరల్ డైరెక్టర్ రావత్‌కు ఆయన కలిసి వినతి పత్రం అందించారు.

ప్రైవేట్ పాఠశాల గుర్తింపు రద్దు

సింహాద్రిపురం, ఆగస్టు 1: సింహాద్రిపురంలోని శ్రీ వివేకానంద ఉన్నత పాఠశాలకు 2024-2025 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల గుర్తింపును విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రద్దు చేసినట్లు ఎంఈఓ ఓబులేసు తెలిపారు. ఈ మేర గురువారం ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈఓ క్రిష్ణప్ప నుండి ఆదేశాలు అందినట్లు ఎంఈఓ తెలిపారు. కానీ గుర్తింపు రద్దు చేసినట్లు మాకు ఎలాంటి నోటీసులు రాలేదని శ్రీ వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. నోటీసులు అందగనే కోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సానుకూల తీర్పు హర్షణీయం



హర్షం వెలిబుచ్చుతున్న ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల ప్రతినిధులు


కడప (మారుతీనగర్), ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధమని, ఆయా రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకునే హక్కు ఉందని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎంఆర్‌పీఎస్, మహాజన్ సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ), మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నాయకులు పేర్కొన్నారు. వీరు గురువారం కలెక్టరేట్ ఎదుట గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే మహావీర్ సర్కిల్ వద్ద గల బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు.ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి కె.మాతయ్యబాబు, ఎంఈఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు గొల్లపల్లి భాస్కర్‌రావు, జయచంద్ర, ఎంఎస్ఎఫ్ నాయకులు కె.ఎన్.రాజు, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నేత చిన్నసుబ్బయ్య పాల్గొన్నారు.

మాదిగల చిరకాల స్వప్నం నెరవేరింది

కమలాపురం రూరల్, ఆగస్టు 1 : సుప్రీం కోర్టు తీర్పుతో మాదిగల చిరకాల స్వప్నం నెరవేరిందని ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ మాదిగ తెలిపారు. గురువారం కమలాపురంలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టులో తీర్పు రావడంతో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు.

ఎస్సీవర్గీకరణను వ్యతిరేకిస్తున్నాం

● ఏపీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు విజయశేఖర్



మాట్లాడుతున్న విజయశేఖర్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 1 :ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు విజయశేఖర్ తెలిపారు. గురువారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తూ ఎస్సీ వర్గీకరణ అనేది ఒక కులానికి సంబంధించినది కాదని, దాదాపు 59 కులాలకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ఒక కులానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చి మిగతా కులాలకు అన్యాయం చేయడం సబబు కాదన్నారు. మాల ఉద్యోగస్తులారా ఇప్పటికైనా మేల్కొని మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ వెళ్లి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఐక్యతతో పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షుడు సురేశ్, కడప జిల్లా కార్యదర్శి పాలెం సంజీవయ్య, నగర అధ్యక్షులు డేవిడ్, సత్యరాజ్, దినేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలి

● ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి

కడప (ఎడ్యుకే షన్), ఆగస్టు 1: నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి, కడప ఎంఈఓ గంగిరెడ్డి, ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం కడప నగరం జయనగర్ కాలనీ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8న జరగనున్న ఎస్ఎంసీ ఎన్నికల్లో ప్రభుత్వం సూచించిన నియమనిబంధనలకు ఎన్నికలు షెడ్యూలు ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఏ పాఠశాలలో అయినా ఎన్నికల సమస్య ఉన్నట్లయితే సమీపంలో ఉన్న పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ ఎన్నికలకు సహక రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప మండల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి కేంద్రీకృతంగా బోధన అభ్యసన ప్రక్రియ సాగాలి

విద్యార్థి కేంద్రీకృతంగా బోధనా అభ్యసన ప్రక్రియ సాగాలని కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి, కడప ఎంఈఓ గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరం ముత్తరాసుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

కేసీ ఉప కాల్వలకు షట్టర్లు ఏర్పాటు



చెన్నూరు కేసీ కాల్వకు షట్టర్లు బిగించిన దృశ్యం

చెన్నూరు, ఆగస్టు 1 : కేసీ ప్రధాన కెనాల్ ఉప కాల్వలైన చెన్నూరు, బుడ్డాయపల్లె, ముండ్లపల్లె కాల్వలకు సంబంధించి పలు షట్టర్లు గతంలో చోరీలకు గురి కావడంతో అవి లేక నీరు వృధాగా పోవడం, రైతులు ఇబ్బంది పడడం, ఆ షట్టర్ల ఖాళీ స్థా నాల్లో మట్టి పోసి పూడ్చడంతో ఇబ్బందులు జరిగేవి. ప్రస్తుతం కేసీ కెనాల్‌కు నీరు రావడం, కేసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు రైతులు షట్టర్లు లేని విషయాలు చెప్పడంతో పాటు కేసీ కాల్వకు నీరు విడుదల చేయడంతో రైతులు ఉప కాల్వల ద్వారా ఇబ్బందులు పడకుండా గురువారం ఈ ఉప కాల్వలకు షట్టర్లు ఏర్పాటు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడాభివృద్ధికి కృషిచేయాలి

వేంపల్లె, ఆగస్టు 1: జిల్లాలో క్రీడాభివృద్ధికి ప్రత్యేక కృషిచేయాలని క్రీడాయువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఉమ్మడి కడప జిల్లా టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షులు రవికుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం రాయచోటిలో మంత్రిని గజమాలతో సత్కరించారు. వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో స్టేడియాలను మెరుగుపరిచి క్రీడా శిక్షణకులను పెంచాలని కోరారు. త్వరలోనే టెన్నికాయిట్ అసోషియేషన్ ఎన్నిక నిర్వహిస్తామని మంత్రికి తెలియజేశారు.

వృద్ధాశ్రమానికి రూ.50వేలు వితరణ



లీలావతి వృద్ధాశ్రమానికి చెక్కు అందిస్తున్న లత

పులివెందుల టౌన్, ఆగస్టు 1: పులివెందుల సమీపంలోని మూలి లీలావతి నాగిరెడ్డి వృద్ధాశ్రమానికి బీటెక్ రవి సతీమణి లత రూ.50 వేలు వితరణ చేశారు. గురువారం వృద్ధాశ్రమం వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సతీమణి లత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రక్తదానం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

వల్లూరు, ఆగస్టు 1 : మండల పరిధిలోని కొప్పోలు గ్రామ పంచాయతీలో కమలాపురం టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నాయకులు తమ సొంత నిధుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రూ.4వేలను అందించారు. ప్రభుత్వం ఇచ్చే వరకు ఈ పింఛన్‌ను తమ సొంత నిధుల నుంచే అందిస్తామని వారు పేర్కొన్నారు.

పులివెందుల ఏడీఏగా ప్రభాకర్‌రెడ్డి



బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌రెడ్డి

పులివెందుల టౌన్, ఆగస్టు 1: పులివెందుల వ్యవసాయ శాఖ డివిజన్ ఏడీఏగా గురువారం అంబవరం ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అందరి అధికారులు, సిబ్బంది సహకారంతో రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయంపై కూడా అవగాహన కల్పిస్తామన్నారు.

ఎన్టీఆర్ సుజల వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన ఎస్ఐ

వేంపల్లె, ఆగస్టు 1: వేంపల్లెలోని హరిజనవాడలో ఎన్టీఆర్ సుజల వాటర్‌ప్లాంట్‌ను ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. తక్కువ ధరకు శుద్ధినీటిని అందించేందుకు ఉపయోగిస్తున్నట్లు టీడీపీ మండల పరిశీలకుడు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి తెలిపారు. మండల కన్వీనర్ మునిరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, నామా వేమకుమార్, శ్రీరామ్‌నగర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

కడప (ఎడ్యుకే షన్), ఆగస్టు 1 : ప్రధానోపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారంఎస్టీఎఫ్ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలన్నారు.

డిగ్రీ కళాశాలలో అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

వేంపల్లె, ఆగస్టు 1: వేంపల్లెలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక నియామకంకోసం ఈనెల 5వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆంజనేయులు తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్ సబ్జెక్టుల్లో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హత ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరై డెమో ఇవ్వాలని ఆయన కోరారు.

చాపాడు కేసీ కెనాల్‌కు నీరు విడుదల

సాగునీటితో ఆయకట్టు రైతుల హర్షం


రాజోలి ఆనకట్ట వద్ద చాపాడు కెనాల్‌కు నీళ్లను విడుదల చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జాన్సన్ తదితరులు

రాజుపాలెం, ఆగస్టు 1: జిల్లా సరిహద్దులోని రాజోలి వద్ద ఉన్న చాపాడు కేసీ కాల్వకు హెడ్‌రెగ్యులేటరు నుంచి గురువారం నీటి పారుదల అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జాన్సన్ 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముందుగా హెడ్‌రెగ్యులరేటరు వద్ద ప్రత్యేక పూజలనంతరం షట్టరు తెరిచి నీటిని వదిలారు. ఈ కాల్వకు దాదాపు పూర్తి స్థాయి కాల్వ 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం 70 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు తెలిపారు. మిగతా నీటిని కూడా దశల వారీ విడుదల చేస్తామని తెలిపారు. రాజుపాలెం, ప్రొద్దుటూరు, చాపాడు మండలాల్ల 18452 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. చాపాడు కేజీ ప్రధాన కాల్వ నుంచి ఆరు ఉప కాల్వలు, 72 తూములు ఉన్నాయన్నారు. 40.5 కిమీ పొడవునా ఈ కాల్వ నిర్మించారు. చెన్నమరాజపల్లె, నాగాయపల్లె, మడూరు, నాగులపల్లె, పల్లవోలు చెరువులకు ఈ కాల్వ పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఒక్కో చెరువుకు 230 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే కుందూ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల రైతులు ముందస్తుగా వరి నారు మడులు సిద్ధం చేసుకున్నారు. నీరు రావడంతో వరిమల్లు సాగు చేసుకునేందుకు స్దిద్ధమవుతున్నారు. ఖరీఫ్ పంట ప్రధాన పంటలైన వరి, పత్తి తదితర పంటలు సాగు చేసుకునేందుకు అనుకూలము.

ప్రమాదాలు జరగకుండా స్పీడ్‌బ్రేకర్ ఉండాలి

● మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి


నేషనల్ హైవే ఇంజనీరు సురేంద్రనాథరెడ్డితో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 1: పట్టణంలోని డీఎస్పీ బంగ్లా వద్ద ఉన్న స్పీడ్‌బ్రేకర్ ఎత్తు ఎక్కువగా ఉందని, సాధారణంగా ప్రమాదాలు జరగకుండా స్పీడ్‌బ్రేకర్ ఉండాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. స్థానికులు సమస్యను తెలపడంతో ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్ ఎత్తు ఉన్న ప్రదేశాన్ని పరిశీలించిన ఆయన నేషనల్ హైవే ఇంజనీరు సురేంద్రనాథరెడ్డికి స్పీడ్ బ్రేకర్ విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు గోనా పురుషోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి'


తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

బద్వేలు, ఆగస్టు 1: మండలంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని తహసీల్దారు కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి వెంకటేష్ మాట్లాడుతూ సి.కొత్తపల్లి 54/3 నుంచి 54/7 సర్వేనెంబర్లలో ప్రభుత్వ భూమి ఉందని ఐదు నెలల నుంచి ఇంటి స్థలాల కోసం ఆందోళన చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కానీ కొందరు రాజకీయ నేతలు ప్రభుత్వ భూమి చదును చేస్తూ ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బినామీ పేర్లతో అక్రమంగా ఆన్‌లైన్ ఎక్కించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

ముర్రు పాలే బిడ్డకు మొదటి టీకా

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో తల్లిపాల విశిష్టతపై ర్యాలీ ● తల్లిపాలు అమృతంతో సమానమని తల్లులకు సూచన
ర్యాలీలో ఐసీడీఎస్, ఆశా, వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల మానవహారం

పుట్టిన బిడ్డకు గంటలోపే లేత పసుపు పచ్చ రంగు కలిగిన ముర్రుపాలు తాపించడమే మొదటి టీకా అని, ఈ పాలు తాగడం వలన బిడ్డ మెదడు చురుగ్గా పనిచేయడమే కాక జ్ఞాపకశక్తి పెరుగుదల కు దోహదపడుతుందని జిల్లా ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం నుంచి ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్, వైద్యఆరోగ్య శాఖలు పాల్గొని తల్లులకు అవగాహన కల్పించారు. పలుప్రాంతాల్లో తల్లి పాల విశిష్టత పై ర్యాలీలు, మానవహారం చేపట్టారు. వివరాల్లోకెళితే...



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ - చాపాడులో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీ టీచర్లు

ప్రొద్దుటూరు, ఆగస్టు 1: పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టించాలని, ముర్రుపాలు అమృతంతో సమానమని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిడ్డకు మొదటి ఆరునెలలు తల్లి పాలు మాత్రమే పట్టాలన్నారు. తల్లి పాలు బిడ్డ శరీరానికే కాదు మెదడుకు కూడా పోషణ ఇస్తుందన్నారు. బిడ్డకు ఆరోగ్యకరమైన జీవితం ఇవ్వాలంటే తల్లి పాలకు మించిన శ్రేష్టమైనవి వేరొకటి లేదన్నారు. కార్యక్రమంలో వైద్యులు హిమబిందు, రూన్సీ సౌమిని, సాహితీ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు డీపీఎంఓ శివశంకరయ్య పాల్గొన్నారు.

చౌడూరులో ర్యాలీ...

చౌడూరులో తల్లిపాల విశిష్టతపై ర్యాలీ చేపట్టారు. చౌడూరు సర్పంచ్ చంద్ర, కామనూరు వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా, సూపర్ వైజర్ వరప్రసాద్, సీహెచ్‌ఓ గౌతమి, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్‌ఎం వేదవతి తదితరులు పాల్గొన్నారు

తల్లిపాలు అమృతంతో సమానం

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 1: తల్లి పాలు అమృతంతో సమానమని డాక్టర్ ఎన్.హిమబిందు అన్నారు. టీబీ రోడ్డు ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు జరిగాయి. రజకవాడ అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించిన ఆమె మాట్లాడారు. పురవీధుల్లో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమాల్లో కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు, తల్లులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ల ర్యాలీ

చాపాడు, ఆగస్టు 1: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల వారోత్సవాలు చాపాడులో గురువారం ర్యాలీ నిర్వహించారు. చాపాడు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ మాట్లాడుతూ తల్లులు వారి పిల్లలకు ముర్రుపాలు తప్పకుండా తాగించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుబ్బరత్న, రాజ్యలక్ష్మి, శారదమ్మ, ప్రత్యూష, వరలక్ష్మి, సౌజన్య, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొండాపురంలో...

కొండాపురం, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్‌మెంట్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేటలో....

ఖాజీపేట, ఆగస్టు 1: బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని వైద్యాధికారి ముబీన్ అన్నారు. పుల్లూరు, పత్తూరు పంచాయతీల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలతో న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కూడా రక్షణ కల్పించబడుతుందన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం వచ్చే అవకాశం ఉండదని, పాలిచ్చే తల్లుల్లో రొమ్ము, గర్భాశయం, అండాశయం క్యాన్సర్ ప్రమాదాలు తక్కువగా ఉంటాయన్నారు. అనంతరం ఆ గ్రామంలోని గర్భిణులు, బాలింతల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, కృష్ణప్రియ, ఎంఎల్‌హెచ్‌పి ఇందిర, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో...

పోరుమామిళ్ల, ఆగస్టు 1: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని సీడీపీఓ లక్ష్మీదేవి అన్నారు. పోరుమామిళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతను తెలిపారు. తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటిదని, శారీరక ధృడత్వాన్ని మంచి ఆరోగ్యాన్ని కలిగిస్తుందన్నారు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండల సెక్టార్ల సూపర్‌వైజర్లు పాల్గొని మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కరిష్మా, ఎంపీహెచ్‌ఓ రఘునాద్, సూపర్‌వైజర్లు మాధవీ, రత్నకుమారి, కాశినాయన మండల సూపర్‌వైజర్లు చంద్రకళ, కలసపాడు మండల సూపర్‌వైజర్లు హరిప్రియ పాల్గొన్నారు.

బి.కోడూరులో....

బి.కోడూరు, ఆగస్టు 1: పుట్టిన బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా అని వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బిడ్డ పుట్టిన అరగంటలోపే బిడ్డకు పట్టే ముర్రుపాలు ఎంతో విశిష్టత కలిగి ఉంటాయన్నారు. అనంతరం బికోడూరు నాలుగురోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పుష్పాంజలి, సీహెచ్‌ఓ నాగమణి, కంటి ఆరోగ్య అధికారి హుసేనయ్య, సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, జయంతి, హెల్త్ అసిస్టెంటు రామతీర్థం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్లూరులో...

అట్లూరు, ఆగస్టు 1: ముర్రుపాలు బిడ్డకు అమృతం వంటివని, పురవీధుల్లో అట్లూరు వైద్యాధికారి అమితాబేగం మాధురి వైద్యసిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తల్లి ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి మురళీకృష్ణ, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హామీల అమలు 'బాబు'కే సాధ్యం

మండలాల్లో పెన్షన్ పంపిణీ చేపట్టిన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి




మంచంలో ఉన్న వ్యక్తికి తెల్లవారుజామునే పెన్షన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా - వికలాంగురాలు అనూషకు పింఛన్ ఇస్తున్న చాపాడు టీడీపీ నేత సుధాకర్‌రెడ్డి - పోరుమామిళ్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న బొజ్జ రోశన్న, సర్పంచ్ యనమల సుధాకర్

ప్రొద్దుటూరు, ఆగస్టు 1: ఇచ్చిన మాటకు కట్టుబడి నిలబడితేనే విలువ ఉంటుందని, దాన్ని కాపాడుకునేందుకు ఎంతవరకైనా వెళ్లాలని, హామీల అమలు ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వితంతువులకు ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేపట్టారు. గురువారం గోపవరం పంచాయతీలోని గోపవరం, రాజీవ్ నగర్, ఇందిరా నగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో ఎన్టీఆర్‌భరోసా పెన్షన్ పంపిణీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య చేతుల మీదుగా పెన్షన్ పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏడాదికి 250 చొప్పున ఐదేళ్లలో రూ.1000 పెంచిదన్నారు కానీ చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పెంచిన డబ్బు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారం రాకముందునుంచే ఏప్రిల్ నుంచే పెంచిన పింఛను అమలు చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళాయమ్మ, గోపవరం సర్పంచ్ మోషా, టీడీపీ యువనేత బచ్చల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో 98 శాతం పెన్షన్ల పంపిణీ

మైదుకూరు రూరల్ ఆగస్టు 1: పట్టణం, మండలంలో తెల్లవారుజాము నుంచే పెన్షన్ల పంపిణీ మొదలైంది. మున్సిపాలిటీలో 5,159, మండలంలో 4,686 పెన్షన్లు ఉండగా 98 శాతం పంపిణీ చేసినట్లు కమిషనర్ జబ్బార్‌మియా, ఎంపీడీఓ ఫజల్ రెహమాన్ తెలిపారు. అందుబాటులో లేని 2 శాతం లబ్ధిదారుల పెన్షన్లు మిగిలాయని తెలిపారు. శుక్రవారం మిగిలిన పెన్షన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. పెన్షన్ల పంపిణీలో సచివాలయం, మున్సిపాలిటీ, మండల స్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు.

కొండాపురంలో 97.73 శాతం...

కొండాపురం, ఆగస్టు 1: మండలంలో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ నాగప్రసాద్ ఉదయాన్నే ఓబన్నపేటలో పెన్షన్లను పంపిణీ చేశారు. సాయింత్రం 6 గంటల వరకు మండలంలో 6438 మందికి 6292 మందికి 97.73 శాతం పూర్తిచేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

96 శాతం పింఛన్‌ల పంపిణీ

కాశినాయన ఆగస్టు1: మండల వ్యాప్తంగా 17 పంచాయతీల్లో 96శాతం సామాజిక పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మొత్తం 5044 పింఛన్‌లకు 4840 పింఛన్‌లను పంచామన్నారు. మిగిలినవి శుక్రవారం పంపిణీ చేస్తామన్నారు. ఎంపీడీఓ, టీడీపీ నేతలు రవీంద్రారెడ్డి, పోలిరెడ్డి, నర్శిరెడ్డి, డి.క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో కూటమి అభ్యర్థి...

పోరుమామిళ్ల, ఆగస్టు 1: ఎన్టీఆర్‌భరోసా పింఛన్లను కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న, సర్పంచ్ యనమల సుధాకర్ పంపిణీ చేశారు. గురువారం ఉదయం నుంచే పోరుమామిళ్ల, రంగసముద్రం, మండలంలోని అన్ని పంచాయతీల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు అధికారులు పింఛన్లను పంపిణీ చేశారు.

చాపాడు, అట్లూరు మండలాల్లో....

చాపాడు ఆగస్టు 1: చాపాడు, అట్లూరు మండలాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు పింఛన్లు పంపిణీ చేశారు. చాపాడు, అన్నవరం, కేతవరం, రాజుపాళెం, నరహరిపురం, పల్లవోలు, బద్రిపల్లె, అయ్యవారిపల్లె, నెర్రవాడ, సీతారాంపురం, నక్కలదిన్నె తదితర గ్రామాల్లో వృద్ధాప్య, వికలాంగుల, చేనేత, ఒంటరి మహిళ పింఛన్లను పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మల్లేశ్వరి, టీడీపీ నేతలు అనూష వికలాంగ బాలింతకు ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో డబ్బు ఇచ్చారు.



అటు మోదం - ఇటు ఖేదం

30 ఏళ్ల పోరాట ఫలితం 'సుప్రీం' తీర్పు : మాజీ ఎమ్మెల్యే పి.ఎం.కమలమ్మ
వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం : మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్


బద్వేలులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి హర్షం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

బద్వేలు/బద్వేలు,రూరల్/జమ్మలమడుగు/మైదుకూరు రూరల్/ప్రొద్దుటూరు/బ్రహ్మంగారిమఠం/ఖాజీపేట,ఆగస్టు 1: 30 ఏళ్ల పోరాట ఫలితంగా సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే పి.ఎం.కమలమ్మ పేర్కొంటుండగా ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు మాలలకు నష్టదాయకమని జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు గోసా మనోహర్ విమర్శించారు. ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన పోరాటంతో వెలువడిన సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎంఈఎఫ్ ఏపీజెఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సాల్మన్, ఎంఈ ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంబటూరు రవీంద్రబాబు వేర్వేరు ప్రాంతాల నుంచి హర్షం ప్రకటించారు. వివరాల్లోకెళితే....

వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని, మాదిగలంతా ఈ తీర్పును స్వాగతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కమలమ్మ ఒక్రపకటనలో అన్నారు.

● దేశవ్యాప్తంగా దళితులను వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత రంగనాయకులు, బద్వేలు నియోజకవర్గ అధ్యక్షుడు గొడుగునూరు ప్రతాప్, మాదిగ ఎంప్లాయిస్ సొసైటీ నేత గురవయ్య పేర్కొన్నారు. సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ నెల్లూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, టపాసులు పేల్చి ఆనందోత్సాహాలు చేసుకున్నారు. వెంకటసుబ్బయ్య, ప్రసాద్, భాస్కర్, చెన్నయ్య, కృష్ణ, రవీంద్ర, జీవీ రమణ, అనకర్ల సుందరయ్య, రాజన్న, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

● వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును ఆహ్వానిస్తున్నామని ఎంఈఎఫ్ ఏపీజెఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సాల్మన్ అన్నారు. జమ్మలమడుగులో ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించి, బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచికెబాబు, దళిత నేతలు సింగరయ్య, నరసింహులు, బాల ఓబయ్య, వై.చిన్నయ్య పాల్గొన్నారు.

● వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తున్న ట్లు మైదుకూరు నుంచి ఎంఈఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంబటూరు రవీంద్రబాబు తెలిపారు.

● వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జ్ యాడికి రమేష్ పేర్కొన్నారు. పాత బస్టాండ్ సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు.


ప్రొద్దుటూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల మహానాడు నేతలు

● సుప్రీంకోర్టు తీర్పుతో ఎమ్మార్పీఎస్ నేతలు బ్రహ్మంగారిమఠం అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి టపాసులు పేల్చి సంబరాలు జరిపారు.

● దశాబ్దాల పోరాటానికి ఎస్సీలకు న్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నేత జయరాముడు అన్నారు. ఖాజీపేట లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి మద్దతు తెలిపారు.



విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 1: ప్రభుత్వం చేపట్టిన స్కూల్ ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాంలో భాగంగా అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకుని దృష్టి లోపాలుంటే అద్దాలు ఉపయోగించాలని సూచించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ కేజే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఏటా ఆగస్టు నుంచి 3 నెలలు కడప అంధత్వ నివారణ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 1: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని కళాశాల నూతన ప్రిన్సిపాల్ జింకా అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు ఉద్యోగ విరమణ చేయడంతో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికోసం కృషి చేస్తానన్నారు. కళాశాల నూతన భవన నిర్మాణాలు చేపడతామన్నారు. హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

వన్ టౌన్ సీఐ బదిలీ

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 1: ప్రొద్దుటూరు వన్ టౌన్ సీఐ ఎం.శ్రీకాంత్ యాదవ్ అనంతపురం టు టౌన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. ఈ ఉత్తర్వులు అందుకున్న అయన అనంతపురం వెళ్లనున్నట్లు తెలిసింది.

ఎర్రగుంట్ల సీఐగా నరేష్‌బాబు

ఎర్రగుంట్ల, ఆగస్టు 1: ఎర్రగుంట్ల అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నరేష్ బాబు నియమితులయ్యారు. ఆయన గతంలో ముద్దనూరు సీఐగా పనిచేశారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో వీఆర్‌లో ఉండగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడి సీఐ ఈశ్వరయ్య కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు వేడుకలు

పోరుమామిళ్ల, ఆగస్టు 1: హుసేన్‌పీర్ దర్గాలో ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం ఉరుసు పురస్కరించుకుని హిందూ ముస్లింలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాదు వాసి చర్చి యావార్సి, మీరట్‌కు చెందిన అసద్‌నిషాద్ ఖవ్వాలి పోటీలు అలరించాయి. గంజ్‌సాయిద్ దర్గాలో గంధం నిర్వహించారు. శుక్రవారం దర్గాలో ఉరుసు వేడుకలు జరగనుందని అంజుమన్ కమిటీ సభ్యులు తెలిపారు.

వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

ప్రొద్దుటూరు,ఆగస్టు 1:ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పు మాలలకు నష్టదాయకమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ విమర్శించారు. గురువారం ప్రొద్దుటూరు పాతబస్టాండ్ సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుపై జాతీయస్థాయిలో పోరాడతామని, తీర్పు రివ్యూ చేయాలని పిటిషన్ వేస్తామనారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ చింతల దానమ్మ, జిల్లా అధ్యక్షుడు పబ్బతి డేవిడ్ శాస్త్రి, లక్షుమయ్య రాష్ట్ర కార్యదర్శి జేష్ఠాది బాస్కర్, తప్పెట లాజర్, రత్నరాజు, జ్యోతి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు స్వాతి లక్షుమయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై చర్యలు తీసుకోండి

పెద్దముడియం, ఆగస్టు 1: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు చేపట్టాలని ఎంపీపీ కె.సుధా అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన పెద్దముడియం మండల సమావేశంలో వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న పథకాలు, వాటి ప్రగతిపై అధికారులు సభముందుంచారు. వ్యవసాయాధికారి అరుణ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. పశువైద్యాధికారి భరత్‌కుమార్‌రెడ్డి, ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ లక్ష్మినరసింహ, డిప్యూటీ తహసీల్దారు గౌసియా తదితరులు పాల్గొన్నారు.